# శివసాగర్ సత్యమూర్తి ఇద్దరూ ఒక్కటే

ఓ రోజు డా॥ కె హరీష్ గారు నన్ను ఇంటికి పిలిపించుకొని తన చిరకాల మిత్రుడు "శివసాగర్ కవితా సంకలనం వేద్దాం వైజాగ్ వెళ్ళి కలిసిరా" అన్నాడు. ప్రొ॥ అత్తులూరి నర్సింహరావు ద్వారా కాంటాక్ట్ చేసి విశాఖ స్టీల్ ప్లాంట్ సెక్టార్8లో తన చిన్న కూతురు శ్రీదేవి ఇంట్లో కలుసుకున్నాను. అది మే 21, 2003 సముద్రతీరం ఉక్కపోత వల్ల చెమట్లు కక్కుకుంటూ సమాచారాన్ని శివసాగర్‌కు చేరవేశాను. ఏడుపదుల వయసు దాటినా ముఖంపై చెరగని చిరునవ్వుతో నన్ను ఇంట్లోకి ఆహ్వానించాడు.

అప్పటికి అతని సాహిత్యం, అడపాదడపా చదివినప్పటికీ రాజకీయాలు పెద్దగా తెలియవు. కాకుంటే ఆరోజు అతనితో మాట్లాడడం నా జీవితంలో ఒక మలుపు. నన్ను చూడగానే ఖమ్మంతో ముడిపడి ఉన్న జ్ఞాపకాల దొంతర ఒక్కసారిగా మదిలో మెదిలినట్లుంది. ఖమ్మం అడవుల్లో ఒక విప్లవ పార్టీకి రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తోన్న సమయంలో జరిగిన ఒక భయంకరమైన ఎదురు కాల్పుల నుండి ఎలా బయటపడ్డదీ, మరుసటి రోజే "జీవితమా! నా యవ్వనాన్ని నాకివ్వు" అని రాసిన కవిత నేపధ్యాన్ని చెప్పాడు. ఆరోజంతా చాలా విషయాలు మాట్లాడాడు. అలా శివసాగర్‌తో నా మొదటి పరిచయం.

కొన్నాళ్ళ తర్వాత వైజాగ్ నుండి కొరియర్‌లో ఒక పార్సిల్ వచ్చింది అది ఆయన స్వ దస్తూరీతో రాసిన ఆత్మకథ. వెంటనే చదివాను ఆయన అంటే ఒక అవగాహన ఏర్పడ్డది. ఒక కొత్త విషయం కూడా తెలిసింది. వాళ్ళ కుటుంబం ఆనాటి డొక్కల కరువులో బురద తాగుతున్న కాలంలో ఆ భీకరమైన కరువును తట్టుకోలేక ఖమ్మం నుండి వీళ్ళ కుటుంబంతోపాటు ఎంతోమంది మాలలు కొల్లేరు దిక్కుగా నడిచారనీ, అలా ఖమ్మం నుండి రావడం మూలాన తన ఇంటిపేరు కంభం జ్ఞాన సత్యమూర్తి, కె.జి. సత్యమూర్తి గా మారింది అని తెలిసింది.

అలా 50వ దశకంలోనే ఆంధ్రయూనివర్సిటీ నుండి MA., BEd చేసి వరంగల్ సెయింట్ గాబ్రియల్‌లో అధ్యాపకుడిగా చేరి మతోన్మాద గుండాలను ఎదుర్కొంటూ, అక్కడ ఉన్న స్టూడెంట్ ఫెడరేషన్ (S.F.) నిర్మాణాన్ని ఎలా చేశాడో తెలిసింది. వరంగల్‌లో తొలివిడత మొదలైన తెలంగాణా ఉద్యమానికి బహిరంగ మద్దతు తెలిపి, గుత్తికొండ బిలంలో చారుమజుందార్‌తో కలిసి విప్లవ బీజాలు వేసి, గోదావరి లోయ, జగిత్యాల జైత్రయాత్ర మొదలుకొని బస్తర్ దాకా విస్తరించి నేడు మహోన్నతంగా నడుస్తోన్న దండకారణ్య నమూనా, మరియు జనతన సర్కార్‌లకు శివసాగర్ సృష్టించిన, సాహిత్య, సాంస్కృతిక విప్లవోద్యమం స్ఫూర్తి అనేది దాచేస్తే దాగని సత్యం.

డా॥ గోపినాథ్ అన్నట్లు కమ్యూనిస్టులు "తెలంగాణా సాయుధ పోరాటాన్ని నిండాముంచిన తర్వాత 70వ దశకంలో కొండపల్లి సీతారామయ్య, కె.జి. సత్యమూర్తిలు వేసిన విప్లవ బీజాలే నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గుండెల్లో బర్మార్లు అయి పేలుతున్నాయి" అనేది అక్షరాల నిజం. అలా చాలాకాలంగా ఆయన సాహిత్య, సైద్ధాంతిక భావజాలం అవగాహన చేసుకోవడం మొదలు పెట్టాను. సెప్టెంబర్ 2004 నాటికి శివసాగర్ సాహిత్యం మొదటి ముద్రణ బయటకు వచ్చింది. తన 36 ఏళ్ళ ఉద్యమ కవితా ప్రస్థానం పేరుతో అక్టోబర్ 20న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కిక్కిరిసిన ప్రేక్షకుల మధ్య ఓ మూల అనామకంగా ఆ పుస్తకంతో నాకేమీ సంబంధం లేనట్లుగా కూర్చున్నా. పుస్తకం వేసే క్రమంలో ఖమ్మం నుండి వైజాగ్ మళ్ళీ హైదరాబాద్ అలా దాదాపు కొన్ని వేల కిలోమీటర్లు తిరిగా. ఇంత కష్టపడి పుస్తకం బయటకు తెస్తే కనీసం నాపేరు సభలో ఉచ్ఛరించలేదు. ఆరోజు కె.కె.ఆర్, చేరా, సతీష్ చందర్, చూపు కాత్యాయని మాట్లాడగా, అరుణోదయ రామారావు, చంద్రశ్రీ పాటలు పాడారు. ఆ పాటల్ని నెమరేసుకుంటూ ఖమ్మం వెనుదిరిగాను. అలా హైదరాబాద్‌లో సాహిత్య దళారీల విశృంఖల రూపం మొదటిసారి ఆ మీటింగ్‌లో చూశా.

ఆ తర్వాత అప్పుడప్పుడూ శివసాగర్ నాకు ఫోన్ చేయడమో, నేను ఉత్తరాలు రాయడమో తప్ప ఎక్కువగా కలిసిందిలేదు. మళ్ళీ 2007 డిసెంబర్‌లో తానే ఫోన్ చేసి హైదరాబాద్ బయలుదేరి రా! రెండవ ముద్రణ వేయాలి అన్నాడు. వైజాగ్‌కు చెందిన తన చిరకాల మిత్రుడు సూర్యనారాయణ, అన్నపూర్ణమ్మల సహకారంతో రెండవ ముద్రణ పనులు మొదలయ్యాయి. అప్పటికే డా॥ హరీష్ గారు చనిపోయారు. "బాబూ సీతారాం! ఈ ముద్రణ డాక్టర్ గారికి అంకితం ఇద్దాం" అన్నాడు. ఎయిర్‌లైన్స్‌లో పనిచేసే కరుణాకర్ అన్న సహకారంతో రెండవముద్రణ బయటకు వచ్చింది.

ఏప్రిల్ 17, 2012న శివసాగర్ ఇకలేడనే వార్త నన్ను తీవ్రంగా కలిచివేసింది. ఇలా ఆయనతో నాకున్న అనుబంధాన్ని మీతో పంచుకొనే అవకాశం కాలం నాకిచ్చింది.

శివసాగర్‌తో నా జ్ఞాపకాలు రాయాలా, ఆయన రాజకీయలు రాయాలా అని ఆయన చనిపోయిన రోజునుంచి అనుకుంటూ ఏమీ రాయలేకపోయా. నాకంటే అర్ధశతాబ్దం ముందు పుట్టాడు. ఒక ఉద్యమానికి నెలబాలుడు అని చెప్పుకుంటూనే తానే తెరచాప అయినవాడు. చరిత్ర గమనాలు, గతులూ కవిత్వంలో అక్షరబద్ధం చేసినవాడు. ఏ నావను నడపాలనుకున్నాడో ఆ నావనుంచి తాను దిగాడా, యేరు దాటినవాళ్లు ఆ నావను తగలబెట్టారా ఇంకా కాలనాళికలో పోస్టుమార్టం జరుగుతూనే ఉంది. ఒక వింత చర్చలో ఆయన గతాన్ని పాతరేశారు సహచరులూ, శత్రువులూ. ఒకరికి సత్యమూర్తి కావాలి. మరొకరికి శివసాగరే కావాలి. ఇదో అసంబద్ధ నాటకం. ఇక్కడ ఎవరి భాష్యాలు వారివే.

పుస్తకం వేసే సందర్భంలో "ప్రతికవితకు పుట్‌నోట్స్ రాయాలి నువ్వు వైజాగ్ రా!"అని అన్నాడు. వాళ్ళ చిన్నమ్మాయి శ్రీదేవి ఇంట్లో రెండు మూడు రోజులు ఉన్నా. ఓ రోజు వాళ్ళ మనవడిని నాకు పరిచయం చేస్తూ "బాబూ! వీడు చందు. నా మనుమడు, కొండపల్లి సీతారామయ్య కొడుకు చంద్రశేఖర్ పేరు వీడికి పెట్టాం" అన్నాడు. అలాంటి నిఖార్సయిన మనిషిని నా జీవితంలో నేనింతవరకు చూడలేదు. ఆయన కవిత్వం గురించి, సిద్ధాంతాల గురించి రాసే వయస్సు అర్హత లేకున్నా ఒకటి మాత్రం నిజం శివసాగర్ తాను నడిచిన నేలంతా పోరాట బీజాలు చల్లిపోయాడు. వ్యక్తిగత జీవితం లేకుండా ఒక మెరుగైన మానవీయ సమాజాన్ని కల గని ఒక ప్రత్నామ్నాయ ఆలోచనా స్రవంతిని ఈ లోకానికి అందించి మననుంచి వెళ్ళిపోయాడు.

ఒక పరిశోధక విద్యార్థిగా నాకున్న అవగాహన ప్రకారం ఆసియా, ఆఫ్రికా, లాటిన్‌అమెరికా విప్లవ సాహిత్యంలో శివసాగర్‌కు ఉన్న సైద్ధాంతిక దృక్పథం, సుదీర్ఘ విప్లవ రాజకీయాలలో ఉన్న అనుభవంతో పాటుగా దానికి సమాంతరంగా విప్లవ సాహిత్య సాంస్కృతిక అవగాహన చాలాకొద్ది మందికి మాత్రమే ఉందని నిర్ద్వందంగా చెప్పవచ్చు.

తెలుగు సాహిత్య లోకంలో ఉన్న పండితులు ప్రబంధ సాహిత్యంలో, బ్రాహ్మణీయ ప్రతీకలు వాడుకుంటున్న సమయంలో, యుగాలను కవులకు అరువు ఇస్తోన్న సంక్షుభిత కాలంలో, ప్రజలకు చెప్పాలనుకున్న విషయాన్ని వాళ్ళలోంచే నేర్చుకొని జీవితాంతం పీడిత ప్రజలకోసమే కవిత్వాన్ని రాసి విప్లవ రాజకీయాలకు కేవలం ఆర్థిక పునాది మాత్రమే కాదు సాంస్కృతిక పునాది కూడా ముందు ఉండాలని, ఆ క్రమంలో మౌఖిక కళారూపాల ద్వారా విప్లవ భావజాల ప్రచారం చేయాలనే తన సైద్ధాంతిక దృష్టి, విప్లవ సాహిత్య, సాంస్కృతిక రంగాలకు దిశానిర్దేశం చేసింది. ఇలా శివసాగర్ ఒక అరుదైన సాంస్కృతిక సంపదను లోకానికి అందించాడు.

ఆ క్రమంలో దళిత సౌందర్య శాస్త్రానికి ఒక బలమైన స్థానిక ప్రతీకలు వాడుకొని "ఇంతకాలం దళిత సాహిత్యం కేవలం ఇంద్రియ జ్ఞానానికి కట్టుబడి వుండటం వల్ల, దళిత సమస్యను చారిత్రక, రాజకీయ, తాత్విక దృక్పథం నుండి వీక్షించక పోవడం వల్ల, ఆ సాహిత్యం సంక్షోభంలో పడిపోయింది" అని హెచ్చరించాడు. అంతే కాకుండా ఇది విప్లవ వాదానికీ, స్త్రీ వాదానికి కూడా హెచ్చరికగా వుండాలన్నాడు.

ఆయన ఎన్ని రాజకీయ పార్టీలు మారినా, ఎంత రాజకీయ సంక్షోభానికి గురైనా, తన జీవితం అంతా అతి నిర్మలంగా, స్వచ్ఛంగా నిజాయితీగా వ్యక్తిగత ఆస్తిలేకుండానే చనిపోయాడు. సిద్ధాంతపరంగా వర్తమాన కాలంలో అగ్రకుల బ్రాహ్మణీయ ప్రోగెసివ్ శక్తులు రాజకీయంగా ఎంత దిగజారినా, మార్క్సిజానికి వక్రభాష్యాలు చెప్పినా వాళ్ళు చేసిన తప్పులను కప్పి పుచ్చడానికి వారి వ్యక్తిగత జీవితంలో కొనితెచ్చుకున్న నిరాడంబర జీవితాన్ని అడ్డుపెట్టి, గ్లోరిఫై చేస్తూ మహనీయులుగా కీర్తించబడ్డారు. చరిత్ర నిర్మాణంలో స్థానం లభిస్తోన్న ప్రతివ్యక్తి వెనుక కులం ఉంది అనేది చారిత్రక సత్యం.

సాంప్రదాయ, విప్లవ కమ్యూనిస్టు శిబిరాల్లో కుల సమస్యపై తమ అవగాహనను మార్చుకోవాలి అని ఆనాడు ఆయన చేసిన ఒంటరిపోరాటం ఒక స్ఫూర్తిదాయకం. తత్ఫలితంగా, కమ్యూనిస్టు పార్టీలలో కుల చర్చ ఒక అనివార్యతను సంతరించుకుంది. సమాజంలో ఉన్న కులతత్వం కమ్యూనిస్టు పార్టీలలో ప్రవేశించిన తీరును ఎండగడుతూ తాను చేసిన అంతర్ బహిర్గత పోరాటానికి పరిష్కార మార్గాలు వెతుకులాడే క్రమంలో ఆయన నుండి కొన్ని తప్పులు దొర్లిన మాట వాస్తవమే కానీ, జీవితాంతం తాను పడిన తపన నిరాడంబరత్వం కుహనా ప్రోగెసివ్ శక్తులకు అప్రధానం అయింది. వామపక్ష, విప్లవ శిబిరాల్లో ఇదో విషాద పార్శ్వం.

అలా శివసాగర్ తన జీవితాంతం ఉన్న నిజాయితీ, సాహితీ సృజన సైద్ధాంతిక పటిమను అప్రధానం చేస్తూ అతన్ని ద్రోహిగా నిలబెట్టాలని బ్రాహ్మణీయ అగ్రకుల మేధావులు కుట్ర చేశారు.

నాల్గు దశాబ్దాలకు పైగా జరిగిన అతని ప్రస్థానంలో శివసాగర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులూ తన రాజకీయాలలో భాగమైనారు. చివరికి ఆయన చనిపోయినపుడు ఆరడుగుల నేల సంపాదించుకోలేకపోవడం ఎంత బాధాకరం? లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న తన పెద్దకొడుకు సిదార్థ రెండు అద్దె గదులలో శివసాగర్‌ని చివరి రోజుల్లో సాకాడు. ఆయన చనిపోయినప్పుడు ఇంట్లో స్థలం సరిపోక ఎదురుగా ఉన్న ఒక పాడుబడ్డ చర్చిలో పార్థివ దేహాన్ని ఉంచాల్సిన దుస్థితి దాపురించడానికి కారణం కేవలం అతని నిస్వార్థత్వం, దళిత కుటుంబంలో పుట్టడం వల్ల మాత్రమే. అలాంటి దుస్థితి ఏ విప్లవ నాయకుడికి వచ్చినా అది అవమానమే. కానీ ఇది కేవలం దళిత విప్లవకారుల విషయంలో ఎక్కువగా ఎందుకు జరుగుతుందో కారణాలు కావాలిప్పుడు.

నాకు శివసాగర్ కుటుంబంలో వాళ్ళ చిన్నమ్మాయి శ్రీదేవి తప్ప మిగతా ఎవరూ తెలియదు. ఒక రోజు వాళ్ళ పెద్దబ్బాయి సిద్దార్థకు ఫోన్‌చేసి "మళ్ళీ మూడవ ముద్రణ వేయాలి. అందుకు మీ పర్మిషన్ కావాలి" అని అడిగా ఆయన వెంటనే "తమ్ముడూ! మా నాన్న జీవితాంతం పేద ప్రజల విముక్తి కోసమే తన సాహిత్యాన్ని ధారపోశాడు, సమాజం నుండి ఆయన ఏమీ ఆశించకుండానే బ్రతికాడు. అది ప్రజల ఆస్థి. అది ప్రజలకే చెందాలి" అని అన్నాడు. ఆయన సాహిత్యం చిరకాలం చరిత్రలో, జనం నోళ్లలో నిలవాలని, ఆయన అభిమానుల గుండెల్లో పదిలంగా ఉండాలని ముందు ముందు తరాలకు కూడా శివసాగర్ రచనలు అందించాలని ఆశించాడు.

శివసాగర్ ఒక తండ్రిగా కుటుంబ పెద్దగా తన వాళ్ళకు ఏమీ చేయలేకపోయాడు. ఆయన కూతురు మాట్లాడుతూ...

"మా నాన్న మాకెవరికీ చెప్పకుండానే తన దారి, గమ్యం ప్రజల్లో చూసుకున్నాడు. దాదాపు నాల్గు దశాబ్దాల తర్వాత చిక్కిశల్యమై డస్సిపోయి ఇంటికి వచ్చాడు. మేము చిన్న పిల్లలుగా ఉన్నపుడు వెళ్ళాడు, మాకు తల్లీ, తండ్రీ అన్నీ మా అమ్మమాత్రమే" అని గద్గద స్వరంతో చెప్పింది శ్రీదేవి. ఆయన అందరిలా సంపాదించుకోలేదు. పేరు ప్రతిష్టల కోసం ప్రాకులాడలేదు. నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు కష్టపడ్డాడు.

శివసాగర్ నోటినుండి నేను చివరిసారి విన్న మాటలు ఇవి "ఇది పెట్టుబడి దారీ సమాజం, ఇక్కడ కీర్తి కూడా పెట్టుబడిగా మారబడుతోంది. అది అత్యంత దయనీయమైన అవాంఛనీయమైన స్థితి. అలా నేను కీర్తి పెట్టుబడి కాకూడదన్న క్రమంలోనే నా సాహిత్యాన్ని నేను వేసుకోలేదు". అంటూ కిక్కిరిసిన హైదరాబాద్, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నావైపు వేలు చూపుతూ "అగో! ఆమూల కూర్చున్న అతనే ఈ పుస్తకం వేశాడు" అని అన్నాడు. అది ఇంకా నాకళ్ళల్లో మెదలుతూనే ఉంది. గడిచిన 9 ఏళ్ళలో ఎన్నో జ్ఞాపకాలు నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. చివరిగా ఆయన ఇష్టంగా పాడుకునేపాట

"నామల్లియ రాలెను! నా మొగిలికూడా రాలెను! నామల్లియ నీ మొగలి ఆకాశం చేరెను!! ఆకాశం చేరెను!!


ఇక్కడ ఏం బాగాలేదు. విప్లవ సాహిత్య వీధుల్లో క్షుద్ర సాహిత్యం బొందల్లోంచి జీవం పోసుకుంటోంది. దళారుల పెరటితోటలో కొత్త కన్ఫెషన్స్ మొగ్గలు తొడుగుకుంటున్నాయి. ఆనాడు నన్నయ్యను "నరేంద్రుని బొందలోనే నిద్రపో" అన్నవాళ్లు, ఇవ్వాళ గురజాడనే ఆధునికతకు ఆద్యుడు అని జంధ్యం పోగులు పేనుతున్నారు. ఇక్కడ నేడు విప్లవోద్యమ చరిత్రను యూదా ఇష్కరియోతులే రాయడానికి పునర్జన్మలెత్తుతున్నారు. దాన్ని ప్రశ్నించడానికి ఇప్పుడు నువ్వు ఇక్కడ లేవుగా!

నిజం శివసాగర్ ! నువ్వు భారతీయ విప్లవోద్యమంలో ఆకాశం చేరిన ధృవతారగా, దిక్కుచూపే చుక్కలా ఎప్పటికీ ఉంటావు.

నీకిదే నా రెడ్ సెల్యూట్!

**గుర్రం సీతారాములు**
సి-6, బషీర్ హాస్టల్
ఇ.ఎఫ్.ఎల్. యూనివర్శిటీ, హైదరాబాద్
8-01-2013

**Siva Sagar Kavitwam** (1931-2012)



ఉరితీయబడ్డ పాట నుండి,
చెరపడ్డ జలపాతం నుండి
గాయపడ్డ కాలిబాట నుండి
ప్రాణవాయువు నుండి
వాయులీనం నుండి
తిరిగి వస్తాను
తిరిగి లేస్తాను
నా కోసం ఎదురు చూడు...



రగుల్ పబ్లికేషన్స్
హైదరాబాద్

శివసాగర్ కవిత్వం

శివసాగర్

# శివసాగర్



కవిత్వం
1931-2012

**Sivasagar Kavitwam (1931-2012)**

by **Sivasagar**

Edited by **Gurram Seetaramulu**
e-mail : seetaramulu@gmail.com
Mobile: 9951661001

©**K.P. Sidhartha**

First Edition : **September, 2004**
Second Edition : **February, 2008**
Third Edition : **January, 2013**

Cover Painting : Laxman Aelay

Publishers:
**Ragul Publications** Hyderabad.
with the support of

**Srinivasa Raju**
H.No. 6-1-82&83, 1st Floor, SSR Chambers,
Lakdi-ka-pool, Hyderabad-500 004.

Sole Distributors :

**Disha,**

Chikkadpally, Hydrabad.

For ebook:
www.kinige.com

Rs. **200/-**



**15-07-1931 17-04-2012**